క్లుప్తంగా

కందులాపురంలో వీధిలైట్ల ఏర్పాటు


స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: స్థానిక కందులాపురం పంచాయతీ పరిధిలోని పూసల బజారులో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయమై ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కరించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

రాచర్ల: మండలంలో మంగళవారం నుంచి 31వ తేదీ వరకు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్ తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పంటల యాజమాన్యంలో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. మంగళవారం గంగంపల్లె, అనుమలవీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్

మార్కాపురం: ఈనెల 24, 25వ తేదీల్లో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మద్దిన జాహ్నవి ప్రియ తెలిపారు. క్రీడా పోటీల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం అథ్లెటిక్స్, యోగా, చెస్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 25వ తేదీ బుధవారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. నియోజవకర్గంలోని అన్ని మండలాల్లో గెలుపొందిన క్రీడాకారులకు(అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు) రెండురోజులపాటు పోటీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు తమ క్రీడాకారులతో హాజరుకావాలని సూచించారు.

ఉర్దూ విద్యార్థులకు టెట్ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్ అందుకుంటున్న విద్యార్థులు

కంభం: ఉర్దూ విద్యార్థులకు ఉచితంగా టెట్ మెటీరియల్ అందించడంతోపాటు శిక్షణ ఇచ్చినట్లు అర్ధవీడు ఎంఈఓ, కో ఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎస్ఎస్)లో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉర్దూ మీడియం చదువుతున్న 50 మంది శిక్షణకు హాజరయ్యారు. ఉర్దూ ఉపాధ్యాయులు హబీబుర్ రహమాన్‌ఖాన్, సయ్యద్ షఫీ, రఫీ, ఆరీఫ్‌ఖాన్, సలీంబాషా, దాదా తదితరులు పాల్గొన్నారు.

29న టెట్ మోడల్ పరీక్ష

పొదిలి: యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, టీచర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన టెట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు యూగాఎఫ్ జిల్లా కార్యదర్శి పి.బాలవెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ పరీక్షను కొనకనమిట్ల, పొదిలి, మర్రిపూడిలో టెట్ అభ్యర్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

సమాచార హక్కును సద్వినియోగం చేసుకోవాలి


పెద్దారవీడు: మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి


రైతులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

దర్శి: సమాచార హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్, బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ 2005 సమాచార హక్కు చట్టం 11 మే 2005లో పార్లమెంట్ ఆమోదం పొందిందన్నారు. 15 జూన్ 2005లో రాష్ట్రపతి ఆమోదించారని చెప్పారు. ఏ అధికారి యంత్రాంగం కింద ఉన్న సమాచారాన్ని పొందగలిగే హక్కు ఉంటుందన్నారు. రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని పొందగలిగే హక్కు, రికార్డుల్లో ఉన్న సమాచారాన్నా ఎత్తి రాసుకోవడం, వాటి నకలు సరిఫికెట్ కాపీలు తీసుకోవడం, డిస్కులు, టేపులు, వీడియో క్యాసెట్, రూపంలో మరే ఇతర ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచారాన్ని అయినా పొందవచ్చన్నారు. చట్టం ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: సమాచార చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సమాచార చట్టంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరమన్నారు. సమాచార చట్టంలోని పలు విషయాలు వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చడంలో పారదర్శకంగా పనిచేయాలని శ్రీనివాసులు అన్నారు. వ్యవసాయాధికారి కె.నీరజ మాట్లాడుతూ రైతాంగం సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాచార చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ– 2 రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ సమాచార చట్టం వివరాలు తెలపాలన్నారు. సమాచార అధికారుల పేర్లు ఫోన్ నంబర్లు కార్యాలయం వద్ద ఉండాలన్నారు. రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు, ప్రజాప్రతినిధులకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005లో అమలు చేశారని, ఈ చట్టంతో కావాల్సిన సమాచారాన్ని సంబంధిత అధికారుల ద్వారా ప్రజలు పొందాలన్నారు. చట్టం ఉద్దేశం అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావటం, అవినీతిని అరికట్టడం, సమాచారంలో పారదర్శకంగా ఉండాలి, ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించటం తదితర విషయాలపై వివరించారు. ప్రజలు సంబంధిత సమాచారాన్ని ఏ అధికారిని అడగాలి, పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు, ఇతర సమాచారాలు నోటీసు బోర్డు ప్రతి కార్యాలయంలో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, వీఆర్వో వెంగళరెడ్డి, రైతులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: సమాచార హక్కు చట్టం కింద అధికార యంత్రాంగం వద్ద ఉన్న సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ఏవో కేవీ శేషారెడ్డి అన్నారు. సోమవారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో జరిగిన సమాచార హక్కు చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాచారాన్ని ఫొటో కాపీలు, క్యాసెట్టు టేపులు, ఎలక్ట్రానిక్ రూపంలో ప్రజలకు అందించడంతో యంత్రాంగం పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని, పౌరునికి అవసరమైన సమాచారాన్ని 30 రోజుల్లో అందించాల్సి ఉంటుందన్నారు. హెచ్‌వో పి.ఆదిరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్


వై.పాలెం: సమావేశంలో మాట్లాడుతున్న ఏవో శేషారెడ్డి

ఒకే సమయంలో రెండు పనులు చేయలేం!


సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

- సచివాలయ ఏఎన్ఎంలు ఆన్‌లైన్ వర్క్ నిలిపివేత
- మెడికల్ అధికారులకు మెమొరాండం అందించిన ఏఎన్ఎంలు

కురిచేడు: సచివాలయం పనులు, ఆరోగ్య కార్యకర్త పనులు ఒకే సమయంలో చేయటం తమ వల్ల కాదంటూ సచివాలయం ఏఎన్ఎంలు తమ విధులు నిలిపివేస్తున్నట్లు సోమవారం మెడికల్ అధికారులకు తెలిపారు. మండలంలోని ఏఎన్ఎంలు అందరూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సూపర్‌వైజర్‌కు తమ వినతిపత్రం అందజేశారు. సచివాలయానికి సంబంధించిన పనులు, ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులు ఒకే సమయంలో చేయాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని, సచివాలయం వ్యవస్థ ద్వారా ఉద్యోగం ఇచ్చినా వైద్యాధికారి పర్యవేక్షణలో పనులు చేయాలని తమకు ఆదేశాలు ఇచ్చారని, కానీ ఇప్పుడు ఇరుశాఖల అధికారులు తమపై ఒత్తిడి పెంచి ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఒత్తిడి కారణంగా మానసికంగా, శారీరకంగా అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. సచివాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్ఎంలు మాతృశాఖకు బదిలీ చేయాలని, ఆరోగ్య కార్యకర్త విధులు మాత్రమే చేయునట్లు మార్గనిర్దేశం చేయాలని కోరుతూ తమ వినతిపత్రం వైద్యాధికారులు సమ్మెలో ఉన్నందున సూపర్‌వైజర్‌కు అందజేశారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు 2వ రోజు సోమవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. పరుగుపందెం, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్ పోటీలు నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో చందలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడలను మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు హోమియో మందులు వేస్తున్న శ్రీమన్నారాయణ

దర్శి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సేవా భారతి ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని రాజంపల్లి, తూర్పు వెంకటాపురం హైస్కూల్లో సీజనల్ వ్యాధులు రాకుండా హోమియో పతి మందులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ మందులు వాడితే జలుబు, దగ్గు, మలేరియా, టైఫాయిడ్, బోదకాలు, డెంగీ బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. పిల్లలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లూరి ప్రకాశ్‌రావు, మేడం చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, శ్రీశైలం, చెంచయ్య, సభ్యులు వీరాచారి, నరసింహారావు, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆ గ్రామానికి నీటి వసతి కల్పించాలి


అంజయ్య వద్ద వాపోతున్న మహిళలు

దొనకొండ: మండలంలోని యర్రబాలెంలో తాగునీటికి, ఇబ్బందికరంగా ఉందని, వెంటనే అధికారులు స్పందించి సాగర్ జలాలు, చేతి పంపులు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. స్థానికుల కోరిక మేరకు సీపీఎం బృందంతో కలిసి ఆయన సోమవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా యర్రబాలెం గ్రామస్తులు, కాలనీ వాసులు తమకు తాగటానికి, పశువులకు నీటి సౌకర్యం లేదని వాపోయారు. ప్రజల నీటి సమస్యను తీర్చాలని, అలా తీర్చకుంటే ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుందుర్తి అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

దొనకొండ: మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమం మంగళ, బుధవారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయశాఖ అనుబంధ శాఖల అధికారుల ద్వారా డిసెంబర్ 31 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రోజుకు రెండు గ్రామాల ప్రకారం, వారంలో నాలుగు గ్రామాలు, నెలకు 8 రోజులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ వివరించారు.

20 సెంట్లలో 20 రకాల మొక్కలు


మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

- పంటల సాగుతో బహుళ ప్రయోజనాలు

తాళ్లూరు (దర్శి): వ్యవసాయాన్ని వ్యాపార దృక్పదంతో సాంకేతికతను జోడించి రసాయన రహితంగా సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. ర్పు గంగవరంలో ప్రకృతి సాగుతో పండిస్తున్న పంట క్షేత్రాలను ఆయన సోమవారం పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 20 సెంట్లలో 20 రకాల పంటలు వేసి బహుళ ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలు, ఎరపంటలు, రక్షక పంటలు, పండ్ల చెట్లు పరిశీలించి వేపగింజలతో చేసిన ఎన్ఎస్‌కే ద్రావణం, ద్రవ జీవామృతం, పిచికారీ చేయించారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరశింహులు మాట్లాడుతూ 20 సెంట్లలో వేసిన ఉల్లి, వేరుశనగ, టమోటా, మిరప, బెండ, వంగ, గోరుచిక్కుడు, ఎర్ర తోటకూర, పచ్చ తోటకూర, గోంగూర, చుక్కకూర, మెంతికూర, బంతి, ఆముదం, కాకర, బీర, జొన్న, మొక్కజొన్న, అరటి వంటి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. 20 సెంట్లలో 20 రకాల మొక్కలకు, పైర్ల బలానికి వాడాల్సిన ప్రకృతి వ్యవసాయానికి చెందిన కషాయాలు, గురించి వివరించారు. రమేష్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆయాలకు జీతాలు విడుదల


పాఠశాలల ఆయాల ఆకలి కేకలు

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే శానిటేషన్ ఆయాలకు మూడు నెలల జీతాలు సోమవారం వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఎంఈఓ–2 సీహెచ్ సుబ్బారావు తెలిపారు. పాఠశాలల ఆయాల ఆకలి కేకలు అన్న శీర్షికతో సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు తొలుత మూడు నెలల జీతాలు విడుదల చేశారు. ఇంకా నాలుగు నెలల జీతాలు రావాల్సి ఉందని ఆయాలు పేర్కొన్నారు. మిగిలిన నాలుగు నెలల జీతాలు కూడా త్వరగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్


విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

ముండ్లమూరు (దర్శి): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులతో మొదటి, రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం మార్కాపురానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రాంభూపాల్‌రెడ్డి తన వంతు సాయంగా పాఠశాలలో పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులతో మొదటి, రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఆవుల సునీత, ఉపాధ్యాయులు చంద్రకళ, పుణ్యవతి, రత్నమాలినీదేవి, పద్మజ పాల్గొన్నారు.

పుల్లలచెరువు ఎస్ఐగా సంపత్‌కుమార్


బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు ఎస్ఐగా ఎల్.సంపత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక స్టేషన్ సిబ్బంది నూతన ఎస్ఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలన్నారు.

పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా జీవన్‌కుమార్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా జీవన్ కుమార్ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు సోమవారం జారీ అయ్యాయి. ఇంత కాలం పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా విధులు నిర్వహించిన విశ్వేశ్వరరావు మంగళగిరి హెడ్ క్వార్టర్‌లోని జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం అధికారిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గిద్దలూరు డివిజన్ పరిధిలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు టైగర్‌లో రేంజి అధికారిగా విధులు నిర్వహిస్తున్న జీవన్ కుమార్‌ను పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా బదిలీ చేశారు. దీంతో పాటు పెద్దదోర్నాల విద్యుత్‌శాఖ ఏఈగా విధులు నిర్వహించిన నాగేంద్రరెడ్డి మార్కాపురం రూరల్ ఏఈ బదిలీపై వెళ్తుండగా, తాళ్లూరు మండలం ఏఈగా విధులు నిర్వహిస్తున్న వీరబ్రహ్మంను పెద్దదోర్నాల విద్యుత్‌శాఖ ఏఈగా బదిలీ చేశారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: విద్యార్థుల సామర్థ్యాలను సోమవారం కవకుంట్ల పాఠశాలలో ఎంఈవో శామ్యూల్ జాన్ తనిఖీ చేశారు. ఆయన పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులు నిరంతర ప్రక్రియగా రాయడం, చదవడం నేర్పించాలన్నారు. రోజూ తప్పకుండా విద్యార్థుల నోట్‌పుస్తకాలు తనిఖీ చేసి పలు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలపై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ నియమాలను అనుసరించి చేయాలని, రుచికరంగా, శుభ్రతగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

35 మద్యం బాటిళ్ల స్వాధీనం


మద్యం బాటిళ్లు చూపుతున్న ఎస్ఐ అనిల్‌కుమార్

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్టలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తి నుంచి 35 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు గ్రామంలో అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఒక వ్యక్తి నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవరైనా అక్రమంగా మద్యం అమ్మినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య శిబిరాలు ఉపయోగించుకోండి

మార్కాపురం: వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని మార్కాపురం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్, ఎముకలు, కళ్లు, చెవి, గొంతు, ముక్కు, చర్మవ్యాధులకు సంబంధించిన వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.రామారావు, మధుకిరణ్, వసంతకుమారి, మనోరంజన్, వంశీ కృష్ణ, రామచంద్రరావు, జి.లక్ష్మీ ప్రసన్న, ఎస్‌కే మౌలాలి, ఫార్మసిస్టు హబీబ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



